క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వర్‌నగర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ ప్యాడ్‌లను గురువారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ట్యాబ్‌లు బహుమతిగా ఇస్తానన్నారు.

ఆస్పత్రి మొదటి అంతస్తు నుంచి దూకిన రోగి

తప్పిన ప్రాణాపాయం

కేపీహెచ్‌బీకాలనీ: ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్న ఓ రోగి మొదటి అంతస్తు ఎలివేషన్ బాల్కనీ నుంచి కిందకు దూకాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఆస్పత్రిలో చూపించినా తగ్గకపోవడంతో హోలిస్టిక్ ఆస్పత్రిలో మూడు రోజుల క్రితం చేర్పించారు. అయితే గురువారం రాత్రి తనను బయటకు పంపాలని అక్కడి నర్సులతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో మొదటి అంతస్తు నుంచి దూకడంతో పార్కింగ్‌లో ఉన్న కారుపై పడి కింద పడ్డాడు. వెంటనే ఆస్పత్రి సిబ్బంది భాస్కర్‌ను ఆస్పత్రిలోకి తీసుకువెళ్లి చికిత్స చేశారు. కాగా భాస్కర్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని ఆస్పత్రి వర్గాలు మీడియాకు తెలిపాయి. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రత్యేక తరగతులతో సబ్జెక్టుల్లోని సందేహాల నివృత్తి
- విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్న స్పెషల్ తరగతులు
- వందకు వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు..


విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న పాఠశాల సిబ్బంది


బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ప్రత్యేక తరగతిలో పదో తరగతి విద్యార్థులు

మోతీనగర్: ప్రభుత్వ పాఠశాలలు అంటే చాలా మందికి వేరే అభిప్రాయం ఉండేది. ముఖ్యంగా కరోనా విపత్తు అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు – మన బడి' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. నేడు ప్రభుత్వ ఉపాధ్యాయుల పనితీరులో ఊహించనంత మార్పు కనిపిస్తోంది. సర్కారు బడులకు పేద, మధ్యతరగతి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఉచితంగా విద్యా, పుస్తకాలు, యూనిఫాం మధ్యాహ్న భోజనం అందిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతోంది. పదో తరగతికి చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకింత ఆందోళన నెలకొని ఉంటుంది. మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని కోరుకుంటారు. ప్రభుత్వం ఆ దిశగా వెళ్తూ టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా...

మూసాపేట డివిజన్ బబ్బుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 4 నెలల నుంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9గంటల వరకు... అదే విధంగా సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు తరగతులు నిర్వహించి విద్యార్థులకు సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వడం విశేషం.

ఉదయం, సాయంత్రం అల్పాహారం

ప్రత్యేక తరగతులు నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 40 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. సాధారణ తరగతులతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఇంటి వద్ద వారు చదువుకునే విధానాన్ని తల్లిదండ్రుల ద్వారా ఉపాధ్యాయులు తెలుసుకుంటున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు..

విద్యార్థులకు మానసిక సమస్యలు లేకుండా ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. విద్యార్థులకు మెంటల్ ట్రెస్ లేకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. అనేక మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్రత్యేక తరగతులకు అవసరమైన వాటిని ఉపాధ్యాయులు దాతల సహకారంతో సమకూరుస్తున్నారు. గతంలో జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించిన పూర్వ విద్యార్థుల గురించి తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడిచేలా విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.

మెరుగైన విద్యను అందిస్తున్నాం..



పదో తరగతి విద్యార్థులకు కొన్ని మాసాలుగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. 2గంటల ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులందరూ ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధించే విధంగా అహర్నిశలు కృషి చేస్తున్నాం.

– శాంత, బబ్బుగూడ పాఠశాల హెచ్‌ఎం

తరగతులు ఎంతో దోహదపడుతున్నాయి..



మా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఉపాధ్యాయులందరూ చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కొన్ని నెలల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో మాకు పదో తరగతి పరీక్షలను ధైర్యంగా రాయడానికి ఈ ప్రత్యేక తరగతులు దోహదపడుతున్నాయి.

– ఆనంద్, టెన్త్ విద్యార్థి

వంద మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాం



ప్రైవేట్ పాఠశాలకు దీటుగా మా పాఠశాలలో కూడా నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. అంతేకాకుండా చదువులో వెనుకబడిన వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. మేమంతా పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందకు వంద మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాం.

– పి.కార్తిక, టెన్త్ విద్యార్థిని

కార్యకర్తలే బీఆర్‌ఎస్ పార్టీకి శ్రీరామరక్ష

కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు


హెచ్‌ఎంటీహిల్స్ కమ్యూనిటీహాలులో ఆత్మీయ సమ్మేళనంలో నాయకులు, కార్యకర్తలు.

భాగ్యనగర్‌కాలనీ: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు.. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో గురువారం హెచ్‌ఎంటీహిల్స్ కమ్యూనిటీ హాలులో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ నాయకుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకోవటం చాలా సంతోషకరమైన విషయమన్నారు. పార్టీ చేసిన ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెండు సార్లు అధికారం చేపట్టి తెలంగాణ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. పరిపాలన విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. కోట్ల నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామన్నారు.

◆ తప్పుడు కథనాలు సృష్టించే ప్రతిపక్ష పార్టీల నాయకుల దుశ్చర్యలను తిప్పి కొట్టే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎనిమిదేళ్లలో ఏమి చేశామో? భవిష్యత్‌లో ఏమి చేయబోతున్నామో? ప్రజలకు వివరించాలని కోరారు. దేశానికి, రాష్ట్రానికి బీఆర్‌ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అన్న విషయాన్ని మరోసారి చాటి చెప్పాలన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని పేర్కొన్నారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు.

◆ పార్టీలో పదవులు పొందిన వారు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. పార్టీ నియమ నిబంధనలకు లోబడి పనిచేసి పార్టీ గౌరవాన్ని మరింత పెంచాలన్నారు. పని చేసే ప్రతి ఒక్కరికి పార్టీలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ సభ్యులు, బస్తీ అధ్యక్షుడు, మహిళా నాయకులు, పార్టీ ప్రధాన, అనుబంధ కమిటీ, బస్తీ కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళి

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో గురువారం స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... 23 ఏళ్లకే దేశం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహనీయులని కొనియాడారు. భగత్‌సింగ్ ఇచ్చిన విప్లవం వర్ధిల్లాలి అనే నినాదం దేశంలోని ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను మరింత రగిలించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వల్లే మనం స్వేచ్ఛా వాయువులు పీల్చగలుగుతున్నామని పేర్కొన్నారు.

– కూకట్‌పల్లి


ఎల్లమ్మబండలోని భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్




కూకట్‌పల్లి బస్టాప్‌లో, వెంకట్రావ్‌నగర్‌లోని నివాళులర్పిస్తున్న నాయకులు

నీరు.. సకల జీవరాశులకు జీవనాధారం



ర్యాలీలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జలమండలి అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీహిల్స్ కాలనీలో ప్రపంచ జల దినోత్సవం–2023 పోస్టర్ ఆవిష్కరణ, ఇంకుడు గుంతల నిర్మాణ అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భూ ప్రపంచంలో నివసిస్తున్న సకల జీవరాశులకు నీరు జీవనాధారమని అన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటిని ఆదా చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత పేర్కొన్నారు.

◆ మనం రాబోయే తరాలకు అందించే ఆస్తి మనం ఇచ్చే నీరు మాత్రమే అని అన్నారు. 2030 నాటికి అందరికి నీరు, పారిశుద్ధ్యం అనే లక్ష్యాన్ని సాధించడానికి ఐక్యరాజ్య సమితి–2023 ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీరు, పారిశుద్ధ్య సంక్షోభాన్ని పరిరక్షించడానికి మార్పును వేగవంతం చేయాలని పిలుపునిచ్చిందన్నారు. సుమారు కోటి మందికి పైగా ఉన్న నగర జనాభాకు రోజుకు 520 మిలియన్ల గ్యాలన్ల మంచినీటిని 200కి.మీ దూరంలో ఉన్న కృష్ణ, గోదావరి నదుల నుంచి సింగూర్, మంజీర, ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ వంటి రిజర్వాయర్ల నుంచి అదిస్తున్నారని తెలిపారు.

◆ నగరంలో ఒక అంచనా ప్రకారం 20 మిలియన్ల గ్యాలన్ల మంచినీరు వృథా చేస్తున్నారన్నారు. నల్లాల ద్వారా వచ్చే నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం సామాజిక బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం ప్రభాకర్, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్లు ప్రశాంతి, ప్రియాంక, ఝాన్సీ, నాయకులు దామోదర్‌రెడ్డి, పోతుల రాజేందర్, గోపి చందర్, అష్రఫ్, అనిల్, విమల, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీకాంత్



భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి ట్రాఫిక్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి.శ్రీకాంత్ తన నిజాయితీని చాటుకున్నారు. కానిస్టేబుల్‌కి మెట్రో పిల్లర్ నం.822 వద్ద ఒక బ్యాగు దొరికింది. దొరికిన బ్యాగును తెరచి చూడగా అందులో రూ.71వేల నగదు, విలువైన పత్రాలు లభ్యమయ్యాయి. తనకు దొరికిన ఆ బ్యాగును కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావుకు అందజేశారు. బ్యాగులు ఉన్న పత్రాల ఆధారంగా బాధితుడిని గుర్తించిన పోలీసులు ఆయన ఐడీపీఎల్‌కు చెందిన కృష్ణ అని గుర్తించి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. సీఐ నర్సింగరావు ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీకాంత్ చేతుల మీదుగా బ్యాగులోని నగదు, పత్రాలను కృష్ణకు అందజేయించారు. ఈ సందర్భంగా కృష్ణ పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రగతి ఉమెన్ క్లౌడ్ కిచెన్ ప్రారంభం



ఆల్విన్‌కాలనీ డివిజన్ పాపమ్మ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రగతి ఉమెన్ క్లౌడ్ కిచెన్‌ను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి ఉమెన్ క్లౌడ్ కిచెన్ అధ్యక్షురాలు మంజుల, సెక్రటరీ పద్మావతి, ట్రెజరర్ చంద్రకళ, సభ్యులు లావణ్య, నీలా, విజయలక్ష్మి, నాగపార్వతి, వనజ, రేఖ, నిర్మల, లలితకుమారి, పద్మ, సురేఖ, నాయకులు సమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– ఆల్విన్‌కాలనీ

ఖైత్లాపూర్‌లో మహిళా భవన్ నిర్మిస్తాం

- అన్ని సదుపాయాలను కల్పిస్తాం
- కంప్యూటర్లను అందుబాటులో ఉంచుతాం
- సమాఖ్య గ్రూప్ మహిళా సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


సమాఖ్య గ్రూప్ మహిళా సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మూసాపేట సర్కిల్ కార్యాలయంలో సమాఖ్య గ్రూప్ మహిళా సభ్యులు, అధికారులతో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జెడ్సీ మమత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళా గ్రూప్ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా వారందరికి గుర్తింపు కార్డులు వచ్చే విధంగా చూస్తామని పేర్కొన్నారు. రీపేమెంట్ రెగ్యులరైజేషన్ చేసుకుని కొత్తగా ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతకంటే ముందు బకాయిలు చెల్లించాలని సూచించారు.

◆ అదే విధంగా మూడేళ్లకు ఒకసారి ఎస్‌ఎల్‌ఎఫ్ గ్రూపులను రెన్యూవల్, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. 10 ఎస్‌హెచ్‌జీల గ్రూపులలో కనీసం ఐదుగురైనా వ్యాపారం చేసుకోవాలన్నారు. ఖైత్లాపూర్‌లో మహిళా భవన్ నిర్మించి కంప్యూటర్‌లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్ని సదుపాయాలు కల్పించి వేతనాలు సక్రమంగా అందేటట్లు చర్యలు తీసుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నివేదిక అందిస్తామని హామీ ఇచ్చారు. ఏప్రిల్ 2వ తేదీన జరిగే జాబ్ మేళా గురించి ప్రతి ఒక్కరికి తెలిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తవద్దు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో గురువారం ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాబోయే రంజాన్, శ్రీరామ నవమి పండుగలు ఉన్నందున విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో పాడైపోయిన విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు ఉంటే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దని సూచించారు.

◆ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లిని విద్యుత్ రంగంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. త్వరలో నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మారుస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటలు పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తుండటంతో పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. అదే విధంగా వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో తెలంగాణను ముందంజలో నిలుపుతున్నారని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం..

మోతీనగర్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో భారీ ఎత్తున చేరుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షుడు గార్లపాటి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు సుమారు 100 మంది నాయకులు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు బోడ నర్సింగరావు, పినిపె చిన అబ్బులు, కొయ్యాడ రాజ్‌కుమార్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో శ్మశానవాటికల నిర్మాణం...

మోతీనగర్: ప్రతి ఒక్కరికి ఆఖరి మజిలీ ఎంతో ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని మౌలిక వసతులు కల్పించటానికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలోని ఇళ్ల మధ్య నిరిస్తున్న నాలా విస్తరణ పనులను పరిశీలించారు. పర్వత్‌నగర్‌లోని ముస్లిం, వి.రామారావునగర్‌లలోని శ్మశానవాటికలను పునర్నిర్మించడంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ శ్మశానవాటికలను గురువారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అల్లాపూర్ డివిజన్‌ను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. హైటెక్ సిటీ, కూకట్‌పల్లికి ఎక్కడికి వెళ్లాలన్నా ఈ ప్రాంతం కేంద్రంగా మారిందన్నారు. వి. రామారావునగర్, స్నేహపురికాలనీ, బబ్బుగూడ, కబీర్‌నగర్‌లలోని ఓపెన్ నాలాలను విస్తరించి నాలాలపై శ్లాబ్ నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ గౌసుద్దీన్, జాహెద్ షరీఫ్‌బాబా, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ ఆనంద్, ఏఈ రంజిత్, వర్కు ఇన్‌స్పెక్టర్ వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.



పర్వత్‌నగర్‌లో ముస్లిం శ్మశానవాటిక పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే